

అఖిలపక్షంతో కలిసి యుద్ధం అన్నీ సిద్ధం



అఖిలపక్ష సమావేశం జరుగనున్న నామక్కల్ కవింజర్ మాళిగై

విస్తృతంగా ఏర్పాట్లు ● పరిశీలించిన సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన పేరుతో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గించేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ ప్రతిపాదనలను ఖండిస్తూ బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించేందుకు సచివాలయం సమీపంలోని నామక్కల్ కవింజర్ మాళిగైలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో డీఎంకే, అన్నా డీఎంకే సహా 45 పార్టీల ప్రతినిధులు హాజరవుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల తగ్గింపు ప్రయత్నాలను అడ్డుకునేలా అఖిలపక్ష సమావేశం జరపాలని ఫిబ్రవరి 25న స్టాలిన్ అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించి, జనాభా కట్టడి చేసినందుకు ప్రతిఫలంగా కేంద్రం రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 39 నుండి 31కి తగ్గించనుందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ విషయమై మార్చి 5న అఖిలపక్ష సమావేశం జరుపనున్నామని, ఈ సమావేశానికి అన్ని పార్టీల ప్రతినిధుల హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం స్టాలిన్ నామక్కల్ కవింజర్‌మాళిగైలో అఖిలపక్ష సమావేశం జరుగనున్న హాలులో సచివాలయ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు పావుగంట సమయాన్ని, తక్కిన పార్టీలకు ఐదు నిమిషాల సమయాన్ని కేటాయిస్తే సమంజసంగా ఉంటుందని స్టాలిన్ భావిస్తున్నారు. ఆ మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, డీపీఐ, పీఎంకే, సీపీఐ, సీపీఎం, మక్కల్‌నీదిమయ్యం సహా 40 పార్టీలకు ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. బీజేపీ అఖిలపక్ష సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఇది వరకే ప్రకటించింది. ఈ సమావేశంలో మెజారిటీ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఓ తీర్మానం చేసి ఆమోదించి, దానిని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు స్టాలిన్ తెలిపారు.

ప్రముఖ తమిళ కవి నందలాలా కన్నుమూత

● సీఎం స్టాలిన్ సంతాపం



నందలాలా (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ కవి, రాష్ట్ర అభ్యుదయ రచయితల, కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య, సంగీత రంగస్థల సర్వసభ్య మండలి సభ్యుడు నందలాలా మంగళవారం ఉదయం కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. బ్యాంక్ ఉద్యోగిగా జీవనయాత్రను ప్రారంభించిన నందలాలా మూడు దశాబ్దాలకు పైగా అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. ప్రస్తుతం రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడిగా ఉన్న దిండుగల్ లియోని నిర్వహించే పట్టిమండ్రాల్లో (వివాద వేదికలపై) ప్రసంగించి తమిళ శ్రోతలను మైమరపించేవారు. కొన్నేళ్ల క్రితం తిరుచ్చి కల్‌మండపం ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుని అక్కడే స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. గత కొంతకాలంగా బెంగళూరులోని కుమార్తె వద్ద ఉండేవారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై అక్కడే ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. నందలాలా అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న డీఎంకే ఎంపీ ఎ.రాజా తన స్నేహితుల ద్వారా వైద్యం కోసం రూ.5లక్షలు కూడా అందించారు. ఈ పరిస్థితులలో మంగళవారం ఉదయం చికిత్స ఫలించక నందలాలా మృతి చెందినట్లు రాష్ట్ర అభ్యుదయ రచయితల, కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదవన్ దీక్షన్యా ప్రకటించారు. నందలాలా అంత్యక్రియలు తిరుచ్చి కల్‌మండపం ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద బుధవారం జరుగుతుందని కుటుంబీకులు పేర్కొన్నారు.

తమిళ సాహిత్య రంగానికి తీరని లోటు...

తమిళ కవి నందలాలా మృతి రాష్ట్ర అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘానికే కాకుండా తమిళ సాహిత్య రంగానికి కూడా తీరని లోటని సీఎం స్టాలిన్ తెలిపారు. నందలాలా మృతిపట్ల ముఖ్యమంత్రి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఓ సందేశం వెలువరిస్తూ పెరియార్ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లేలా నందలాలా ప్రతి సభల్లోనూ ప్రసంగించేవారని తెలిపారు. ఇటీవల తన జన్మదిన వేడుకల ముందస్తు సభల్లోనూ ఆయన ప్రసంగించారని గుర్తు చేశారు. నందలాలా మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో తిరిగే రైళ్లకు హిందీలో పేర్లు

తమిళ భాషను అంతమొందించడమే వారి ధ్యేయం ● కేంద్రంపై స్టాలిన్ ధ్వజం

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిభాషకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు మంచిదని, అదే సమయంలో ప్రతిభాషను విద్యార్థులపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించడం వారికి భారం అవుతుందని డీఎంకే అధ్యక్షుడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే పార్టీ పత్రిక 'మురసొలి'లో పార్టీ శ్రేణులకు ఆయన ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో తిరిగే రైళ్లకు అందమైన తమిళ పేర్లు పెట్టకుండా హిందీలో పేర్లు పెడుతున్నారని, ఇలాంటివి పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం తమిళ భాషను శాశ్వతంగా అంతమొందించే ప్రయత్నాల్లో ఉన్నట్లు స్పష్టమవుతుందని ఆయన ధ్వజమెత్తారు. ఇటీవల తన జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఆర్‌ఎన్ రవి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జాతీయ నాయకులంతా శుభాకాంక్షలు తెలిపారని, వీరందరిదీ ఒక ఎత్తయితే, తనకు శుభాకాంక్షల సందేశం పంపిన సోదరి డాక్టర్ తమిళిసై మరో ఎత్తులో నిలిచారని ప్రశంసించారు. మూడు భాషల్లో ఆమె తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషం కలిగించిందని, ఆంగ్లం, తమిళంలోనే కాకుండా తెలుగుభాషలోనూ ఆమె గ్రీటింగ్ చెప్పారని, ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సి ఉందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు హిందీ భాష ఎంచుకోకుండా తెలుగు భాష ఎంచుకోవడం తమిళుల మనస్తత్వాన్ని తెలుపుతోందన్నారు. తనకు తెలుగు రాయడం, చదువడం రాదని, సోదరి తమిళిసై తెలుగు రాష్ట్రంలో గవర్నర్‌గా పనిచేయడం వల్ల తెలుగులో టైప్ చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోగలిగారన్నారు. వీటన్నింటిని బట్టి ప్రతిభాషకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు మంచిదని, అదే సమయంలో నిర్బంధంగా ఓ భాషను అమలు చేస్తే వారికి గుదిబండగా మారుతుందన్నారు. తమిళిసైలా రాష్ట్రంలో తమిళం, ఆంగ్లంతో పాటు ఏ భాషనైనా ఐచ్ఛికంగా ఎంపిక చేసుకుని చదివితే ఎలాంటి సమస్య ఉండదని, అలాకాకుండా తమిళుల మనస్తత్వానికి విరుద్ధంగా హిందీ భాష మాత్రమే నేర్చుకోవాలంటూ బలవంతం చేయడాన్నే డీఎంకే ఆది నుంచి వ్యతిరేకిస్తోందని ఆ లేఖలో వివరించారు. రాష్ట్రంలో సీబీఎస్‌ఈ పాఠశాలల్లో హిందీ నేర్చుకోవడాన్ని ఎలా అనుమతిస్తున్నారంటూ కొంతమంది అజ్ఞానులు విమర్శిస్తున్నారని, ఆ పాఠశాలన్నీ కేంద్ర ప్రభుత్వ సిలబస్‌నే పాటిస్తాయనే విషయం వారికి తెలియకపోవడం గర్హనీయమన్నారు. రాష్ట్ర సిలబస్‌ను పాటించే ఏ పాఠశాలలోనూ త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడం లేదనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు.

మద్రాసు హైకోర్టుకు నలుగురు శాశ్వత న్యాయమూర్తులు



పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టుకు నలుగురు శాశ్వత న్యాయమూర్తులు నియమితులయ్యారు. ప్రస్తుతం మద్రాసు హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ రామస్వామి, జస్టిస్ ధనపాల్, జస్టిస్ చిన్నసామి, జస్టిస్ కందస్వామిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. వాటిని పరిశీలించిన కేంద్రప్రభుత్వం.. రాష్ట్రపతికి పంపించింది. ఆ సిఫారసును రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి మంగళవారం ఆ నలుగురినీ శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎన్‌జీ బస్సులు

డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా

ఖర్చు, కాలుష్యం తగ్గుతుందన్న రవాణా శాఖ

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తొలివిడతగా వెయ్యి డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని రవాణా శాఖ నిర్ణయించింది. రాష్ట్ర రవాణా సంస్థ చెన్నై, విల్లుపురం, కుంభకోణం, సేలం, కోవై సహా ఆరు ప్రాంతీయ రవాణా కార్యాలయాల ద్వారా 317 డిపోల నుంచి 20,232 బస్సులు నడుపుతోంది. వీటిలో చెన్నై ప్రాంతీయ రవాణా కార్యాలయం పరిధిలో మాత్రమే ప్రతిరోజూ 3.5 లక్షల మంది ఈ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. లాభాపేక్ష లేకుంగా గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రభుత్వ బస్సులు నడుపుతున్నారు. దీంతో, రాష్ట్ర రవాణా సంస్థ నష్టాల్లో ఉందనే ఆరోపణలున్నాయి. ఈ బస్సులకు సంబంధించి డీజిల్ ఖర్చు ఎక్కువవుతోంది. అలాగే, వాతావరణ కాలుష్యం కూడా ఏర్పడుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రికల్ బస్సులు, సహజ వాయువుతో కూడిన బస్సులు నడపాలని నిర్ణయించిన రవాణా శాఖ.. ఈ అంశంపై అధ్యయనం చేసింది.. ఈ పరిశోధనల్లో, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ బస్సులు నడిపితే అదనపు మైలేజ్ వస్తుందని తేలింది. దీంతో, పొరుగు ప్రాంతాలకు నడిపే బస్సులను సహజ వాయువుగా మార్చాలని నిర్ణయించారు. తొలివిడతగా వెయ్యి బస్సులు సీఎన్‌జీ బస్సులుగా మార్చనున్నారు. సీఎన్‌జీ (గ్యాస్)కు మార్చే బస్సులు అత్యధికంగా 8 లక్షల కి.మీ, తక్కువగా 6 నుంచి 7 సంవత్సరాలు నడుపనున్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.70 కోట్లు కేటాయించింది. ఈ విషయమై రవాణా శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... రాష్ట్రంలో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ బస్సులు నడపడంపై పలు అధ్యయనాలు చేపట్టామన్నారు. ఆ ప్రకారం, అధిక మైలేజీ, కాలుష్యం తగ్గేలా సహజ వాయువు వినియోగించి బస్సులు నడపాలని నిర్ణయించామని తెలిపారు. అదే సమయంలో, డీజిల్ బస్సుల కన్నా సీఎన్‌జీ వినియోగం కారణంగా పర్యావరణ పరిరక్షణతో పాటు ఖర్చు కూడా తగ్గే అవకాశ ముందన్నారు.



ఆరు వైద్య కళాశాలలకు అనుమతివ్వండి

● కేంద్ర మంత్రికి సుబ్రమణ్యం వినతి



కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు వినతిపత్రం సమర్పిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో వైద్య కళాశాలలకు అనుమతించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అలాగే, నామక్కల్, తిరుప్పూర్, విరుదునగర్ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ వైద్యకళాశాల్లో 50 అదనపు సీట్లు చొప్పున, రాష్ట్రంలో అదనంగా 500 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు అనుమతించాలని వినతిపత్రంలో కోరగా, కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.





కొత్త స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

అన్నాసాలైలో రూ.3 కోట్లతో హాకీ స్టేడియం

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై ఖాయిదే మిల్లత్ ప్రభుత్వ మహిళా కళాశాల సమీపంలో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల్లో రూ.3కోట్లతో నిర్మించిన హాకీ స్టేడియంను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మంగళవారం ప్రారంభించారు. ఆ స్టేడియం ప్రాంగణం వద్ద రెండు ఏసీ వ్యాయామశాలలు, రెండు క్రికెట్ టర్ఫ్‌లకు కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల ప్రకారం ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ రూ.3 కోట్లతో మినీ స్టేడియంలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు చేపాక్ - ట్రిప్లికేన్ నియోజకవర్గంలో హాకీ స్టేడియంను, ఇదే విధంగా మదురై, శివగంగ, తూత్తుకుడిలో నిర్మించిన మినీ స్టేడియంలను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

తిరుత్తణి మురుగన్ సేవలో మద్రాసు హైకోర్టు సీజే

తిరుత్తణి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారిని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఈ ఆలయంలో మాసి మఖం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన ప్రధాన న్యాయమూర్తికి ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ వి.సురేష్‌బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముందు తిరువనంతపురం సందర్శించిన ప్రధాన న్యాయమూర్తికి తిరువళ్లూర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జూలియట్ పుష్ప, జిల్లా కలెక్టర్ ప్రతాప్, సూపరింటెండెంట్ శ్రీనివాస పెరుమాళ్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో తిరుత్తణి ప్రొ జడ్జి మలర్కొడి, తిరుత్తణి జిల్లా సివిల్ జడ్జి గురులక్ష్మి, తిరుత్తణి రెవెన్యూ డివిజినల్ అధికారి దీప, తాలూకా అధికారి మలర్వళి, ఆలయ సూపరింటెండెంట్ చిత్ర తదితరులున్నారు.



ప్రధాన న్యాయమూర్తికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధవారం) : 6.25
సహర్ (గురువారం) : 4.42

ఎన్నికల వేళ పొత్తులపై నిర్ణయం

● ఈపీఎస్ నర్మగర్భ వ్యాఖ్యలు



ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలప్పుడు బీజేపీతో పొత్తు అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన సుమారు 400మందికి పైగా కార్యకర్తలు సేలం ఆత్తూర్‌లో మంగళవారం ఎడప్పాడి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. వారికి ఎడప్పాడి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎడప్పాడికి వెండి శూలాయుధాన్ని కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, ప్రస్తుతం అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ లేదని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కమలం పార్టీని కూటమిలోకి చేర్చుకోవడంపై నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ డీఎంకే అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేను ప్రారంభించారని తెలిపారు. ఆయన తర్వాత దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత కూడా రాష్ట్రాభివృద్ధికి మంచి పథకాలను ప్రవేశపెట్టారని, అన్నాడీఎంకే 30ఏళ్ళు అధికారంలో కొనసాగిన అతిపెద్ద పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. అంతటి చరిత్రకలిగిన అన్నాడీఎంకేను లేకుండా చేయాలని పలువురు ప్రయత్నించి సాధించలేక చతికలబడ్డారని ఎద్దేవా చేశారు. కార్యకర్తలే పార్టీని అభివృద్ధి మార్గంలోకి తీసుకెళ్తున్నారని, వారి కృషివల్లే పార్టీ బలపడుతోందన్నారు. 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడేలా వుండాలని ఆయన రాష్ట్రప్రజలకు పిలుపునిచ్చారు. సేలం జిల్లాకు అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రకటించిన ఒక్క పథకాన్ని కూడా డీఎంకే ప్రభుత్వం నెరవేర్చలేదని వివరించారు. రాష్ట్రంలో మళ్ళీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివాహం చేసుకునే యువతులకు ఉచిత మంగళసూత్రం, నగదు పంపిణీ పథకాన్ని అమలుపరుచనున్నట్లు ఈపీఎస్ పేర్కొన్నారు.

డీఎండీకేకు రాజ్యసభ సీటా?

అన్నాడీఎంకే కూటమిలోవున్న డీఎండీకేకు రాజసభ సీటు కేటాయింపుపై ఇప్పటికే ఒప్పందం కుదిరి సంతకాలు కూడా పూర్తయ్యాయని, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత చెబుతున్నారనే ప్రశ్నపై, స్పందిస్తూ.. డీఎండీకేకు అలాంటి హామీ ఏదీ ఇవ్వలేదని ఈపీఎస్ స్పష్టం చేశారు.

సమాచార ధ్వని

7 నుంచి 'చెన్నై పెన్ షో'

అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు చెన్నై పెన్ షో జరుగనుంది. అడయారులో ఫోర్టిస్ మలర్ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఫైకా హాలులో ఏర్పాటుచేశారు. ఈ షో తిలకించేందుకు ప్రవేశం ఉచితం. ఈ పెన్ షో గత యేడాది షోను బ్రేక్ చేయనుంది. గత యేడాది 35కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయగా ఈ యేడాది 45కు పైగా ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో స్వదేశీ, విదేశీ బ్రాండ్ల ప్రదర్శన, విక్రయానికి అందుబాటులో ఉంచారు. అతి తక్కువ ధర కలిగే సాధారణ పెన్‌ల నుంచి డైమండ్స్ పొదిగిన రూ.25 లక్షల విలువ చేసే పెన్నులున్నాయి.

జాలర్లకు ఆర్థిక సాయం పెంపు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాలర్లకు అందించే ఆర్థిక సహాయాన్ని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, శ్రీలంక నావికాదళ స్వాధీనం చేసుకున్న పడవ యజమానులకు అందించే ఆర్థిక సహాయాన్ని రూ.6లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచారు. అలాగే, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్ల కుటుంబాలకు అందిస్తున్న రోజువారీ నివారణ సాయం రూ.350 నుంచి రూ.500లకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

టన్ను చెరకు ధర రూ.3,151

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెరకు కొనుగోలు ధర టన్నుకు రూ.3,151గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, 2024-25 సీజన్‌కు చక్కెర శాతాన్ని బట్టి చెరకు కొనుగోలు ధర నిర్ణయించింది. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు, 9.50 శాతం, అంతకంటే తక్కువ చక్కెర కలిగిన చెరకుకు రూ.3,267.10, 10 శాతం చక్కెర కలిగిన చెరకుకు రూ.3,344.20, 10.65 శాతం ఉన్న చెరకుకు రూ.3,532.80 అందించనున్నారు.

రికార్డు స్థాయిలో నిస్సాన్ మాగ్నైట్ అమ్మకాలు

అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలోని ప్రముఖ కంపెనీ నిస్సాన్ గత నెలలో జరిగిన అమ్మకాలను వివరించింది. ఇందులో నిస్సాన్ మాగ్నైట్ ఈ20 రికార్డు స్థాయిలో 50 వేల యూనిట్ల ఎగుమతి అమ్మకాలు జరిపినట్టు వెల్లడించింది. ఈ మోడల్ కార్లు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి దేశీయ మార్కెట్‌లో హోల్‌సేల్ విక్రయాలు పెరిగాయి. ఎల్‌హెచ్‌డీ వెర్షన్ ఆవిష్కరించిన తర్వాత ఈ యేడాది జనవరి నుంచి ఈ కంపెనీ కార్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఫిబ్రవరిలో నిస్సాన్ మొత్తం 8,567 యూనిట్లను విక్రయించగా, ఇందులో దేశీయ విక్రయాలు 2,328, ఎగుమతులు 6,239 యూనిట్లను విక్రయించినట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

కుత్రాలం జలపాతాల్లో స్నానాలకు అనుమతి

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నీటి ప్రవాహం తగ్గడంతో కుత్రాలంలోని ప్రధాన జలపాతం సహా అన్ని జలపాతాల్లో పర్యాటకుల స్నానాలకు జిల్లా యంత్రాంగం అనుమతించింది. తెన్‌కాశి జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా కుత్రాలం జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా శుక్రవారం నుండి జలపాతాల వద్ద స్నానాలకు నిషేధం విధించారు. ఈ క్రమంలో, జలపాతాల వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఉదయం నుంచి పర్యాటకుల స్నానాలకు అనుమతించారు.

నాణ్యత లేని 145 మందులు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మందుల ఉత్పత్తి సంస్థలు విక్రయదారులకు సరఫరా చేసే మందుల నమూనాలు పరిశీలించగా, 145 మందులు నాణ్యత లేవని నిర్ధారణ అయింది. ఈ మందులు అధికంగా హిమాచల్‌ప్రదేశ్, జార్కండ్ తదితర రాష్ట్రాల్లో తయారు చేస్తున్నారు. గత జనవరిలో సుమారు వెయ్యి మందుల నమూనా పరిశీలించారు. వాటిలో జలుబు, ఇన్‌ఫెక్షన్, మధుమేహం, జీర్ణ మండల సమస్యలు, విటమిన్ లోపం తదితరాలకు అందిస్తున్న 145 మందులు నాణ్యత లేనివని వెల్లడైంది. ఈ మందుల వివరాలు cdsco.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు.

జర్మనీలో నర్సు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జర్మనీ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఆరు నెలల అనుభవం ఉండి 35 ఏళ్లలోపున్న డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి జర్మన్ భాష నేర్పించడంతో పాటు నెలకు రూ.2 లక్షల వేతనం ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్వీయ వివరాలతో పాటు విద్యార్హత, అనుభవం, పాస్‌పోర్ట్ నకళ్లతో omclgerman2022@gmail.com అనే ఈ-మెయిల్‌లో ఈ నెల 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్, 044-22505886, 6379179200 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

సింగపూర్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోవై నుంచి సింగపూర్‌కు సోమవారం రాత్రి 8.15 గంటలకు ఇండిగో విమానం బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికి సాంకేతికలోపం తలెత్తింది. చాలా సేపటి వరకు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. అనంతరం మళ్లీ విమానాన్ని కోయంబత్తూర్‌లో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. హైదరాబాద్ వెళ్లే విమానంలో ప్రయాణికులను సింగపూర్ పంపారు. విమానంలో సాంకేతికలోపం సరిచేయడంతో రాత్రి 11.30 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళ్లింది.

కులగణన చేపట్టాలంటూ 16న ఎన్టీకే ర్యాలీ

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుల గణన చేపట్టాలని కోరుతూ నామ్ తమిళర్ పార్టీ (ఎన్టీకే) ఆధ్వర్యంలో ఈ నెల ర్యాలీ చేపట్టనున్నారు. పార్టీ ఆర్గనైజర్ సీమాన్ నేతృత్వంలో చెంగల్పట్టులో సాయంత్రం 4 గంటలకు జరుగనున్న ఈ ర్యాలీ పార్టీ జిల్లా కార్యదర్శులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆ పార్టీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పిలుపునిచ్చింది.

స్కూలు వ్యాన్ బోల్తా

● విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన వ్యాన్

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా వాళప్పాడి సమీపం కలరంబట్టి వద్ద ప్రైవేటు స్కూలు వ్యాన్ బోల్తాపడి 16 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వాళప్పాడి సమీపం పళనియాపురం ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో అత్తూరు పరిసర ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారు. రోజూ ఆ పాఠశాలకు చెందిన వ్యాన్‌లో, రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో వారు పాఠశాలకు వస్తుంటారు. మంగళవారం ఉదయం శివపెరుమాళ్ అనే డ్రైవర్ నడుపుతున్న వ్యాన్‌లో పెద్దనాయకన్ పాళయం పరిసర ప్రాంతాలకు చెందిన 16మంది బాలబాలికను ఎక్కించుకుని బయలుదేరారు.. వ్యాన్ కలరంపట్టి రహదారిలో వెళుతుండగా అదుపుతప్పి ఓ ఇంటిని ఢీకొని రోడ్డు పక్కనే బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన చిన్నారులను స్థానికులు వ్యాన్ నుంచి బయటకు తీసి అంబులెన్స్‌లను రప్పించి సమీపంలోనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం సేలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మల్లియకరై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

విజయ్‌ది పగటికల

అందరూ ఎంజీఆర్ కాలేరు ● మాజీమంత్రి జయకుమార్



ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో చక్రం తిప్పిన ఎంజీఆర్‌లా ఎదిగి, వచ్చే ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పగటికలలు కంటున్నాడని అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్ విమర్శించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలో లేనప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండేది అన్నాడీఎంకే మాత్రమేనన్నారు. విజయ్ పార్టీకి రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ అసెంబ్లీ ఎన్నికలపై సలహాలిస్తున్నారని, అయితే అన్నాడీఎంకేను ముందుకు నడిపించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ఎవరి సలహాలు లేకుండానే ప్రజల మెప్పుపొందేలా ఎదిగారన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 3శాతం ఎక్కువ ఓట్లు మాత్రమే పొంది డీఎంకే అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. డీఎంకే కూటమిలోవున్న డీపీఐ, సీపీఎం తదితర పార్టీలు అప్పుడే అసెంబ్లీ ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయని, ఎన్నికలు దగ్గరపడే కొద్ది ఆ కూటమిలో మిగతా పార్టీలు కూడా ఇలాగే వ్యవహరించే అవకాశముందన్నారు.

హోటళ్లలో పాలిథీన్ సంచుల వినియోగం

● కలెక్టరేట్ వద్ద అరిటాకులతో ధర్నా



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో పాలిథీన్ సంచుల వినియోగం నిషేధించాలని డిమాండ్ చేస్తూ పల్లడం ప్రాంతానికి చెందిన సంఘసేవకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అరటాకులు పట్టుకుని ధర్నాకు దిగారు. ఆ తర్వాత కలెక్టర్ క్రీస్తురాజ్‌ను కలుసుకుని వినతి పత్రం అందించారు. పాలిథిన్ సంచుల్లో వేడిగా ఆహారపదార్థాలను ఇవ్వడం వల్ల వాటిని తింటే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని, ఈ విషయంపైనే తాము ప్రజలలో అవగాహన కల్పించేందుకు అరటాకులు పట్టుకుని ధర్నా చేసినట్టు సంఘసేవకులు తెలిపారు.

22న ముల్లై పెరియార్ పర్యవేక్షణ కమిటీ భేటీ

అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ నెల 22వ తేదీ ముల్లై పెరియార్ డ్యామ్ పర్యవేక్షణ కమిటీ సమావేశం కానుంది. ఈ డ్యామ్‌లో నీటి నిల్వ ఎత్తు పెంపుతో పాటు అనేక సమస్యలపై దాఖలైన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వివాదాలపై కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ కోర్టులకు ఎక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ డ్యామ్ విషయంలో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల మేరకు కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ నెల 22వ తేదీ సమావేశంకానుంది. ఇందులో తమిళనాడు ప్రభుత్వం తరపున జలవనరుల మంత్రిత్వ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి మంగత్ రామ్ శర్మ, కావేరీ టెక్నికల్ కమిటీ చైర్మన్ సుబ్రమణి తదితర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

18 నుంచి వైద్యుల దశలవారీ ఆందోళన

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఈ నెల 18 నుంచి దశల వారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రభుత్వ వైద్యుల న్యాయ పోరాట కమిటీ ప్రకటించింది. ఈ మేరకు కమిటీ విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు దేశంలోనే వైద్యరంగంలో అగ్రస్థానంలో ఉన్నా, అందుకు సరిపడా వైద్యులు పోస్టుల భర్తీ కావడం లేదన్నారు. దీంతో, వైద్యులపై పనిభారం పెరిగి మానసికంగా, శారీరకంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే, పొరుగు రాష్ట్రాలతో పోల్చితే వైద్యుల వేతనాలు కూడా తక్కువగా ఉంటున్నాయన్నారు. తమ సమస్యల పరిష్కారానికి దశల వారీ ఆందోళనలు చేపట్టనున్నామని తెలిపారు. ఆ ప్రకారం, ఈ నెల 18వ తేది ముఖ్యమంత్రి, జాతీయ వైద్య కమిషన్‌కు పోస్టు కార్డులు పంపడం, 19న వైద్య విద్య పరిశోధన డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించనున్నామన్నారు. అలాగే, సేలం జిల్లా మేట్టూరు నుంచి చెన్నైకి పాదయాత్ర చేపట్టనున్నట్లు కమిటీ ప్రకటించింది.

కొండ చిలువ పట్టివేత



కొండ చిలువను బంధిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుత్తణి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులు కొండ ఆలయం దిగువ భాగంలో వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, పార్కింగ్ ప్రాంతంలో మంగళవారం కొండ చిలువను గుర్తించిన కొందరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని కొండ చిలువను బంధించి సమీపంలోని అడవుల్లో వదిలిపెట్టారు.

నామక్కల్‌లో దారుణం

● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలోని ఓ ఇంటి నుంచి తల్లి, కుమారుడు, కుమార్తె మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... నామక్కల్ జిల్లాకు చెందిన ప్రేమ్‌రాజ్-మోహనప్రియ (33) దంపతులకు పిరిణిరాజ్ (13) అనే కుమారుడు, ప్రిణితి (6) అనే కుమార్తె ఉంది. ప్రైవేటు బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న ప్రేమ్‌రాజ్, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.50 లక్షల వరకు రుణాలు తీసుకున్నాడు. అప్పుల బాధ తట్టుకోలేక లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో, ఇంట్లో మోహనప్రియ, పిరిణిరాజ్, ప్రిణితి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మోహనప్రియ తన ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని వెల్లడైంది. పరారీలో ఉన్న ప్రేమ్‌రాజ్ ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

'సీఎం ఫార్మశీ'లో రూ.27 లక్షల విక్రయాలు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'సీఎం ఫార్మశీ' మందుల దుకాణాలు ప్రారంభించిన 8 రోజుల్లోనే రూ.27 లక్షల విక్రయాలు జరిగాయని ప్రభుత్వం తెలియజేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 1,000 'సీఎం ఫార్మశీ'లను ముఖ్యమంత్రి స్టాలిన్ గత నెల 24వ తేది ప్రారంభించారని తెలిపింది. 462 ప్రైవేటు, 538 సహకార సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ దుకాణాలు ప్రారంభించిన ఈ నెల 3వ తేది వరకు 8 రోజుల్లో రూ.27 లక్షలకు పైగా విక్రయాలు జరిగాయని తెలిపారు.

ఉగ్ర దాడులను అరికట్టేలా 'మాక్ డ్రిల్'



వేలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి వీఐటీ యూనివర్సిటీలో జాతీయ భద్రతా దళం, కమాండో దళాలకు చెందిన 200 మంది, ఉగ్రవాద దాడులు అరికట్టేలా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన వారిని విడిపించడం, ఉగ్రవాదులను అదుపులోకి తీసుకోవడం తదితర విన్యాసాలను సైనికులు ప్రదర్శించారు. అగ్నిమాపక, రెవెన్యూ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణాల పరిశీలన



ఇటుక నాణ్యత పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేల్‌మురుగన్

తిరుత్తణి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరక్కోణం రోడ్డులో రూ.15 కోట్లతో బస్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులను ప్రభుత్వ పరిశీలన కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్ నేతృత్వంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులతో బస్‌స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిర్మాణపనుల్లో వినియోగిస్తున్న ఇటుక రాళ్ల నాణ్యత సరిగా లేదని, ఈ విషయమై కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

రిటైర్డ్ డీజీపీ సునీల్ ఎంపిక సరైనదే

● హైకోర్టుకు తెలపిన ప్రభుత్వం

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక బోర్డు చైర్మెన్‌గా రిటైర్డ్ డీజీపీ సునీల్‌ను అర్హతను బట్టి నియమించామని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని మద్రాస్ హైకోర్టులో రాష్ట్రప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. సునీల్ నియామకాన్ని రద్దుచేయాలని కోరుతూ, సీనియర్ న్యాయవాది ఇన్బదురై హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌కు రాష్ట్రప్రభుత్వం తరుపున ప్రభుత్వ న్యాయవాది మంగళవారంకౌంటర్ దాఖలు చేశారు. అందులో తమిళనాడు యూనిఫామ్ ఎంపిక బోర్డుకు రిటైర్డ్ డీజీపీ సునీల్‌ను నియమించే విధంగా 1991వ సంవత్సరం సవరించే చట్టం అమల్లోకి వచ్చిందని, సునీల్ అర్హతను బట్టే చైర్మెన్‌గా నియమించినట్లు ప్రభుత్వంవివరించింది.రాష్ట్రంలో ప్రస్తుతం డీజీపీ స్థాయిలోవున్న అధికారులు ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో పనిచేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వంతరుపు న్యాయవాది అందులో స్పష్టంచేశారు. ఇరుతరుపు వాదనల అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి న్యాయమూర్తి సీవీ కార్తికేయన్ వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

భూకబ్జా కేసు

● ఎంకే అళగిరి పిటిషన్ తోసివేత

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భూకబ్జా కేసు నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ మాజీ కేంద్ర మంత్రి ఎంకే అళగిరి దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. మదురై జిల్లా తిరుమంగళం సమీపం శివరక్కోటలో ఎంకే అళగిరికి ఇంజనీరింగ్ కళాశాల ఉంది. కళాశాల సమీపంలోని 44 సెంట్ల ఆలయ స్థలాన్ని కబ్జా చేశారంటూ అళగిరి సహా పలువురిపై మదురై జిల్లా క్రిమినల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు ఆధారంగా అళగిరి, సంపత్‌కుమార్ సహా ఏడుగురిపై భూ కబ్జా కింద పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు నుంచి తప్పించాలని అళగిరి దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మదురై జిల్లా కోర్టు, నకిలీ పత్రాలు సృష్టించి మోసం చేశారనే ఆరోపణ నుంచి మాత్రమే అళగిరిని తప్పిస్తూ 2021లో ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ మదురై భూ ఆక్రమణల విభాగం పోలీసులు, హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. అలాగే, కేసు నుంచి తప్పించాలని కోరుతూ అళగిరి తరపున పిటిషన్ దాఖలైంది. ఈ రెండు పిటిషన్లను మంగళవారం విచారించిన మద్రాసు హైకోర్టు, భూ ఆక్రమణ విభాగం పోలీసుల పిటిషన్ పరిగణలోకి తీసుకొని, నకిలీ పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడ్డారనే ఆరోపణల నుంచి అళగిరిని తప్పించిన ఉత్తర్వులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, కేసు నుండి విడుదల చేయాలనే అళగిరి పిటిషన్ తోసిపుచ్చుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

పిరమల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో 5 భాషల్లో షార్ట్ ఫిల్మ్‌లు

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఫైనాన్స్ సంస్థ పిరమల్ ఫైనాన్స్ తమ సంస్థ ద్వారా రుణాలు పొందినవారు వారి కోరిక ఎలా నెరవేర్చుకోగలిగారనే విషయాన్ని ప్రధానాంశంగా చేసుకుని ఐదు భాషల్లో షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. వాటిని ఇటీవలే యూట్యూబ్, సన్ నెక్స్‌ట్‌లో ప్రసారం చేస్తున్నట్లు ఆ సంస్థ మార్కెటింగ్ హెడ్ అరవింద్ అయ్యర్ తెలిపారు. సత్సంకల్పాల (నల్లనోక్కమ్)కోసం రుణాలు పొందినవారి జీవితాలు మెరుగయ్యాయనే విషయాన్ని తమిళంలో 'ఆయ్‌వు' తెలుగులో 'సమీక్ష' కన్నడంలో 'పరాక్' పేరుతో ఈ షార్ట్ ఫిల్మ్‌ల ప్రసారానికి మంచి స్పందన కూడా లభిస్తోందన్నారు. తమిళ వెర్షన్‌కు ప్రముఖ సినీ నటుడు నిళగళ్ రవి వ్యాఖ్యాతగా వ్యవహరించారని తెలిపారు.



వేలూరులోని పెండలెంట్ ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రూ.150 కోట్ల వ్యయంతో చేపట్టిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలను మంగళవారం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, పీడబ్ల్యూడీ అసిస్టెంట్ ఇంజనీర్ పడవేట్టన్ తదితరులు

కొవిడ్ కాలంలో అధిక వడ్డీ

● పరిశీలించాలంటూ ఆర్బీఐకి హైకోర్టు ఉత్తర్వు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కారణంగా పలువురు ఉద్యోగాలు కోల్పోయారు. అందువల్ల బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు, ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోయారు. ఉద్యోగాలు కోల్పోవడం, వేతనం తగ్గింపు తదితర కారణాల వల్ల బ్యాంకుల్లో రుణాలకు సంబంధించిన వడ్డీ మాఫీ చేయాలని ప్రజలు కోరారు. కానీ, వడ్డీ మాఫీ చేసేందుకు బ్యాంకులు నిరాకరించాయి. అదే సమయంలో ఈఎంఐ చెల్లింపునకు అవకాశం కల్పించారు. కొన్ని బ్యాంకులు అధిక వడ్డీలు వసూలుచేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మద్రాసు హైకోర్టులో శాంతికుమారి దాఖలు చేసిన పిటిషన్‌లో... కరోనా కాలంలో ప్రైవేటు బ్యాంకులు అధిక వడ్డీ వసూలు చేస్తున్నాయని, వీటిని మాఫీ చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా, కొవిడ్ కాలంలో అధిక వడ్డీ విధించిన ప్రైవేటు బ్యాంకులకు వ్యతిరేక ఫిర్యాదుపై నాలుగు వారాల్లో పరిశీలించాలని భారత రిజర్వ్ బ్యాంక్‌కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

చెన్నై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

అడయార్, మార్చి 4 (అంధ్రజ్యోతి): చెన్నై ఎయిర్‌పోర్టుకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విమానాశ్రయంలోని ఇండిగో విమానాయాన సంస్థ కార్యాలయానికి మంగళవారం ఉదయం ఒక ఈ మెయిల్ అగంతకుల నుంచి వచ్చింది. అత్యంత శక్తిమంతమైన బాంబు పేలనుందని అందులో పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వగా, వెంటనే అగ్నిమాపక సిబ్బంది, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ వింగ్ ఇలా పలు విభాగాలకు చెందిన పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆ కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టాయి. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి బాంబు లేదని నిర్ధారణ అయింది. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

విక్రవాండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

● రూ.2.14 లక్షలు స్వాధీనం

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విక్రవాండిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు లెక్కల్లో చూపని రూ.2.14లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం పెద్ద మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నారని ఏసీబీకి సమాచారం అందింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరిగాయి. మారువేషాలతో ఆ కార్యాలయంపై నిఘా వేసిన విల్లుపురం ఏసీబీ డీఎస్పీ వేల్ మురుగన్ నేతృత్వంలోని పోలీసు బృందం సాయంత్రం 5గంటలకు ఆ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లోపలున్న ప్రజలను బయటకి పంపించి, సబ్ రిజిస్ట్రార్ సూర్య, కార్యాలయ సిబ్బందిని అదుపులోకి తీసుకుని సోదా చేశారు.. ఇందులో పలు కీలక దస్తావేజులతో పాటు లెక్కలో చూపని రూ.2,14,120లు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 10గంటలకు తనిఖీలు పూర్తిచేసిన ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్‌ను విచారణ నిమిత్తం తమతో తీసుకెళ్లారు. గత ఏడాది సెప్టెంబరు 14వతేదీ ఇదే తరహాలో ఈ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు అప్పుడు కూడా లెక్కల్లో చూపని రూ.94,570 నగదు, కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

ఎయిర్‌పోర్ట్‌లో రిటైర్డ్ విద్యుత్ అధికారి మృతి

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జర్మనీ వెళ్లేందుకు వచ్చిన రిటైర్డ్ విద్యుత్ బోర్డు అధికారి ఆకస్మికంగా మృతి చెందారు. కోడంబాక్కంకు చెందిన రిటైర్డ్ విద్యుత్ బోర్డు అధికారి శివరామన్ భార్యతోపాటు జర్మనీకి వెళ్లేందుకు మంగళవారం ఉదయం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి కుర్చీలో కూర్చుని తమ వంతు చెకింగ్ కోసం వేచి చూశారు. పావుగంట తర్వాత చెకింగ్ కోసం అధికారులు పిలువగానే కుర్చీలో నుంచి శివరామన్ భార్య లేచి ఆయన వద్దకు వెళ్ళి చెకింగ్‌కు వెళదాం రమ్మని పిలిచినా పలకకపోవడంతో ఆయనను కదలించగా కుర్చీలో తలవాల్చేశారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలుసుకుని ఆమె విలపించింది. విమానాశ్రయ అధికారులు అంబులెన్స్‌ను పిలిచి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. విమానాశ్రయ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

తిరువళ్లూరులో ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్య

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులో ప్లస్‌టూ పరీక్షలు రాసే ఓ విద్యార్థిని సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడింది. తిరువళ్లూరు జయనగర్‌లో ఫొటో స్టూడియో నడుపుతున్న సురేష్ కుమార్తె ప్రియ (17) అదే ప్రాంతంలోవున్న ఓ ప్రైవేటు పాఠశాల్లో ప్లస్‌టూ చదువుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ప్రారంభమైన ప్లస్‌టూ పరీక్షల కోసం చదువుకున్న ప్రియ, సోమవారం తెల్లవారుజామున శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తట్టుకోలేక కేకలేయడంతో కుటుంబ సభ్యులు తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు 99శాతం కాలిపోవడంతో కీల్పాక్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స ఫలించక ప్రియ అర్ధరాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా వుండగా, ప్లస్‌టూ పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని ప్రియ చదివే పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేయడం వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని ప్రియ తండ్రి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఈ నెల 7 నుంచి మే 9వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. ఆ ప్రకారం కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం తదితర ప్రాంతాలకు ఈ నెల 7వ తేది 265 బస్సులు, 8వ తేది 270 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈ నెల 7, 8 తేదీల్లో తలా 51 ప్రత్యేక బస్సులు, మాధవరం టెర్మినల్ నుండి ఈ నెల 7,8 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఆదివారం రోజున వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

12 నుంచి సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యవస్థాపకత అభివృద్ధి కార్యక్రమంలో ఈ నెల 12 నుంచి 14వ తేది వరకు మూలికా సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో కొబ్బరినూనె సబ్బు, హెర్బల్ సబ్బు, ఆయుర్వేద సబ్బు, హెయిర్ గ్రోత్ ఆయిల్, హెయిర్ గ్రోత్ షాంపూ, ఫేస్ వాష్ జెల్, హ్యాండ్ వాష్ లిక్విడ్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణలో పాల్గొనే యువతీ, యువకులకు వేర్వేరుగా ఏసీ వసతితో కూడిన గదులను తక్కువ అద్దెకు అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చు. శిక్షణకు సంబంధించిన వివరాలు కార్యాలయ పనివేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా, 8668108141, 701014 3022, 866810 2600 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

కోవై జైలులో రిమాండ్ ఖైదీ మృతి

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోవై కేంద్ర కారాగారంలో గుండెపోటుతో ఓ రిమాండ్ ఖైదీ మృతిచెందినట్లు జైలు అధికారులు తెలిపారు. దిండుగల్ జిల్లా దశరాపట్నం గ్రామానికి చెందిన గణేశన్ (46)ను విడుమలైలో జరిగిన ఓ దాడి కేసులో గత ఏడాది జూలైలో అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు కోవై జైలుకు తరలించారు. మంగళవారం ఉదయం జైలులో అతనికి కేటాయించిన రూమ్‌లో స్పృహతప్పి పడివుండడంతో జైలు అధికారులు వెంటనే కోవైలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు గుండెపోటు కారణంగా మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై రేసుకోర్స్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అడవుల్లో నిప్పంటించిన ఇద్దరి అరెస్ట్

వేలూరు, మార్చి 4 (అంధ్రజ్యోతి): అడవుల్లో నిప్పంటించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్పాడి అటవి డివిజన్ కోట కొండ బీట్, చెంగాత్తం డివిజన్‌లోని అటవీ ప్రాంతాల్లో కొద్దిరోజుల క్రితం కార్చిచ్చు ఏర్పడింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అటవీ శాఖ అధికారులు, అడవుల్లో నిప్పంటించిన సైదాపేటకు చెందిన ఇర్ఫాన్, జాన్‌బహదూర్ భాషా తదితరులను అరెస్ట్ చేశారు.

పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో ప్రారంభించిన దర్శకుడు



స్టూడియో ప్రారంభోత్సవంలో సినీ ప్రముఖులు

ప్రముఖ సినీ దర్శకుడు ఏఎల్ విజయ్ 'డి స్టూడియో పోస్ట్' పేరిట సొంతంగా పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో ప్రారంభించారు. సినిమా నిర్మాణంలో పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను 'ఒన్ స్టెప్ డెస్టినేషన్'గా దీన్ని రూపొందించారు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన టెక్నాలజీ అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా డాల్బీ అట్మాస్ సౌండ్ మిక్స్, డబ్బింగ్, డీసీపీ, ఓటీటీ మాస్టరింగ్, వీఎఫ్‌ఎక్స్, డీఐటీ స్టోరేజ్ వంటి సౌకర్యాలు ఈ స్టూడియోలో ఉన్నాయి. సాలిగ్రామంలోని శంభు ప్రసాద్ అవెన్యూలో ఏర్పాటు చేసిన ఈ స్టూడియోను శివకుమార్, ప్రియదర్శన్, మంజిమా మోహన్, నట్టి నటరాజ్, ఉదయా, తంబి రామయ్య, నిర్మాత ఐసరి డాక్టర్ కె.గణేష్, పీసీ శ్రీరామ్, దర్శకుడు బాలా, నిర్మాత ధనుంజయన్ వంటి అనేక మంది సినీ ప్రముఖులు ప్రారంభించారు. కాగా, సీనియర్ దర్శకుడు ప్రియదర్శన్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన ఏఎల్ విజయ్ 'కిరీటం' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'పొయ్ సొల్ల పోరోమ్', 'మదరాసపట్టిణం', 'దైవతిరుమగన్', 'తాండవం', 'తలైవా', 'దేవి, 'తలైవి' వంటి హిట్ చిత్రాలను రూపొందించారు. ఆయన చివరగా 'మిషన్ చాప్టర్-1' మూవీకి దర్శకత్వం వహించారు. అలాగే, హీరోయిన్ అమలాపాల్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకుని, ఆ తర్వాత విడాకులు తీసుకున్న విషయం తెల్సిందే.

జై - మీనాక్షి జంటగా కొత్త చిత్రం

తమిళ చిత్రజ్యోతి

బీవీ ఫ్రేమ్స్ పతాకంపై బాబు విజయ్ దర్శకత్వంలో జై, మీనాక్షి గోవిందరాజన్ జంటగా కొత్త చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ పూజా కార్యక్రమానికి హాజరై చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ప్రముఖ నిర్మాత ధనుంజయన్ తొలిక్లాప్ కొట్టగా, మురుగదాస్ కెమెరా స్విచాన్ చేశారు. పలు చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేసిన బాబు విజయ్ ఈ మూవీ ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు రొమాన్స్, థ్రిల్లర్, ముఖ్యమైన సామాజిక అంశాన్ని అభిమానులకు నచ్చే విధంగా తెరకెక్కించనున్నారు. జై, మీనాక్షి గోవిందరాజన్ జంటగా నటించే ఈ మూవీలో యోగిబాబు, కేజీఎఫ్ ఫేం గరుడ రామ్, శ్రీమాన్, ఆదిత్య కదిర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చెన్నై, కొడైక్కెనాల్, నెల్లూరు తదతర ప్రాంతాల్లో షూటింగ్ జరుపనున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'విశ్వంలో అనేక ఆశ్చర్యకరమైన విషయాలున్నాయి. ఒక మనిషి జీవితంలోనూ అనేక ఆశ్చర్యకరమైన సంఘటనలు జరుగుతుంటాయి. మన దేశంలో జరిగిన, జరుగుతూనే ఉన్న ఒక ముఖ్య సామాజిక అంశాన్ని ఈ మూవీలో ప్రస్తావిస్తున్నాం' అని వివరించారు.



జై, బాబు విజయ్, మీనాక్షి గోవిందరాజన్



కొత్త చిత్ర పూజా దృశ్యం

'పితామగన్' వల్లే గుర్తింపు : లైలా



బాలా దర్శకత్వంలో వచ్చిన 'పితామగన్' చిత్రం వల్లే తనకు కోలీవుడ్‌లో గుర్తింపు వచ్చిందని, అదే ఇప్పటికీ కొనసాగుతోందని నటి లైలా అన్నారు. బాలా దర్శకత్వంలో వచ్చిన 'నందా', 'పితామగన్' చిత్రాల ద్వారా మంచి క్రేజ్‌తో పాటు గుర్తింపు సొంతం చేసుకున్న హీరోయిన్ లైలా. ఆ తర్వాత విజయ్ హీరోగా నటించిన 'ది గోట్'లో ఓ పాత్ర పోషించగా, ఆది పినిశెట్టి హీరోగా వచ్చిన 'శబ్దం' మూవీలో విలన్‌గా నటించారు. అయితే, దర్శకుడు "బాలా-25" పేరుతో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో లైలా పాల్గొనలేదు. దీంతో ఆమెను పలువురు విమర్శించారు. వీటిపై ఆమె ఇపుడు వివరణ ఇచ్చారు. 'బాలాకు సన్మాన కార్యక్రమం జరిగిన సమయంలో ఒక తెలుగు సినిమా షూటింగులో ఉండిపోయాను. బయటకు రాలేని పరిస్థితి. బాలా దర్శకత్వం వహించిన సినిమాల్లో నాకు అద్భుతమైన పాత్రలు లభించాయి. 'పితామగన్' నా కెరీర్‌లోనే ఎంతో ముఖ్యమైన చిత్రం. ఆ మూవీలో నేను చెప్పిన డైలాగులను అభిమానులు ఇపుడు కూడా మీమ్స్ రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. పైగా అభిమానులు నన్ను మరిచిపోకుండా ఉన్నారంటే కారణం 'పితామగన్' మూవీనే. రీఎంట్రీలో కూడా నాకు మంచి పాత్రలు లభిస్తుండటం ఎంతో సంతోషం కలిగిస్తుంది. ఇపుడు తమిళం, తెలుగు భాషలో నా పాత్రకు నేను డబ్బింగ్ చెప్పుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

'మెహందీ సర్కస్' కాంబో రిపీట్

2019లో విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం 'మెహందీ సర్కస్'. ఈ సినిమాలోని పాటలకు విశేషాదరణతో పాటు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఈ మూవీ సక్సెస్ సినీ పరిశ్రమలోని ఎందరో దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచింది. దీనికి కారణంగా ఈ చిత్ర కంటెంట్ అలాంటిది ఈ కాంబినేషన్‌లో ఇపుడు మరో మూవీ రూపొందనుంది. డైరెక్టర్ రాజు శరవణన్ దర్శకత్వంలో మాదంపట్టి రంగరాజ్ హీరోగా ఈ మూవీ రూపొందనుంది. గత యేడాది డిసెంబరులో ప్రారంభించిన షూటింగ్ ధర్మపురి పరిసర కొండ ప్రాంతాల్లో చిత్రీకరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటుంది. ఈ మూవీలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. మూవీని వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

విజయ్ మీడియా ముందుకు ఎందుకు రావడం లేదు?

● ప్రశ్నించిన నటుడు విశాల్



అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)పార్టీ స్థాపించిన సినీ హీరో విజయ్ మీడియా ముందుకు ఎందుకు రావడం లేదని హీరో విశాల్ ప్రశ్నించారు. విజయ్ రాజకీయ ప్రవేశంపై మీ స్పందన ఏంటని విశాల్‌ను మీడియా ప్రశ్నించగా, దానిపై ఆయన స్పందిస్తూ 'ముందు విజయ్‌ను మీడియా ముందుకు రమ్మనండి. ఆయన రాజకీయ పార్టీ స్థాపించి యేడాది పూర్తయింది. ఇప్పటివరకు ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీడియా ముందుకు రాలేదు. నన్ను ప్రశ్నలు అడిగేముందు ముందు విజయ్‌ను ప్రశ్నించండి. విజయ్ మీడియాతో సమావేశమైతే మీరు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి' అని విశాల్ అన్నారు. విజయ్ విషయంలో విశాల్ చెప్పిన అభిప్రాయాన్ని పలువురు నెటిజన్లు స్వాగతిస్తున్నారు.

మారియమ్మన్ ఆలయంలో
వైభవంగా మాసి ఉత్సవాలు

● భక్తుల కోలాహలం





కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం నియోజకవర్గంలో ప్రసిద్ధిచెందిన మారియమ్మన్ ఆలయ మాసి ఉత్సవాల్లో 10వేల మందికి పైగా భక్తులు పాల్గొని కంకణ ధారణతో వ్రతం ప్రారంభించారు. సోమవారం ధ్వజారోహణంతో ఈ ఆలయంలో ఈ ఏడాది మాసి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండోరోజైన మంగళవారం తెల్లవారు జామున భక్తులు కాంతమలై తీర్థకొలనులో స్నానాలు ఆచరించి, పసుపు దుస్తులు ధరించి అక్కడినుండి జలకలశాలు నెత్తిన బెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్ళారు. సుమారు 10వేలమందికి పైగా భక్తులు అమ్మవారి దివ్యనామస్మరణతో ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారులతో కంకణం కట్టించుకున్న భక్తులు 15రోజుల వ్రతాన్ని ప్రారంభించారు. ఈ నెల 7,11,14 తేదీల్లో అమ్మవారు సర్వాలంకారంలో నెమలి, సింహం, హంస వాహనాల్లో విహరిస్తారు. ఈ నెల 18వ తేదీ మంగళవారం ఉత్సవాల్లో ప్రధానాంశం సాహస కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అనంతరం దీక్ష చేపట్టిన భక్తులంతా, ఆ రోజు రాత్రి అగ్నిగుండంలో ప్రవేశించి మొక్కులు చెల్లించుకుంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కిలాంబాక్కం వరకే దూర ప్రాంత బస్సులు

● తాంబరంలో తగ్గిన ట్రాఫిక్ ● ప్రయాణికులకు తప్పని తిప్పలు

అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వెళ్ళే దూర ప్రాంత బస్సులు నగర శివారు ప్రాంతమైన కిలాంబాక్కం నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే, వివిధ జిల్లా కేంద్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు మాత్రం తాంబరం వరకే నడుపుతున్నారు. ఈ కారణంగా తాంబరంతో పాటు పెరుంగళత్తూరులలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీని పరిష్కారం కోసం ట్రాఫిక్ పోలీసులు బస్సుల క్రమబద్ధీకరణ చేశారు. ఇందులో భాగంగా, దక్షిణాది జిల్లాల నుంచి ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులను కిలాంబాక్కం వరకే పరిమితం చేశారు. దీంతో తాంబరంలో ట్రాఫిక్ సమస్య కొంతమేరకు తగ్గింది. అయితే, ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పలేదు. కిలాంబాక్కం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు సిటీ బస్సులు అందుబాటులో లేవు. అలాగే, కిలాంబాక్కం బస్టాండుకు ఎదురుగా నిర్మిస్తున్న సబర్బన్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో సబర్బన్ రైళ్ళలో వెళ్ళదలచుకున్న వారంతా వండలూరుకు వచ్చి అక్కడ నుంచి సబర్బన్ రైళ్ళలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, ఒకవైపు ప్రయాణ బడలికతో పాటు మరోవైపు, తమ లగేజీలతో రైల్వే స్టేషన్‌కు చేరుకోవడం వారికి తలకుమించిన భారంగా మారింది. ఇదిలావుంటే, కిలాంబాక్కం బస్టాండులో దిగే ప్రయాణికుల కోసం ప్రస్తుతం నగర రవాణా సంస్థ ఎంటీసీ 589 సిటీ బస్సులను నడుపుతోంది. ఈ సంఖ్యను మంగళవారం నుంచి మరింతగా పెంచింది. రెగ్యులర్ సర్వీసులను మినహా అదనంగా మరో 104 బస్సులతో 816 ట్రిప్పులు నడిపేలా చర్యలు తీసుకుంది. ముఖ్యంగా కిలాంబాక్కం - తాంబరం రైల్వే స్టేషన్‌ల మధ్య ఈ అదనపు సర్వీసులను అధిక సంఖ్యలో నడుపుతున్నారు. దీంతో తాంబరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. అయితే, ప్రయాణికులు మాత్రం ట్రాఫిక్ పోలీసుల నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అరకొర సదుపాయాలు, బస్సు సర్వీసులు నడుపుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కిలాంబాక్కంకు వచ్చే ప్రయాణికుల కష్టాలు తీరాలంటే జీఎస్టీ రోడ్డు అడ్డంగా ఫుట్ వోవర్ వంతెనతో పాటు నిర్మాణంలో ఉన్న రైల్వే స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. కాగా, చెన్నై మహానగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కిలాంబాక్కం బస్టాండును ప్రభుత్వం నిర్మించిన విషయం తెల్సిందే. ఇక్కడ నుంచే అన్ని దక్షిణాది జిల్లాలకు దూరప్రాంత బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.



తాంబరం రైల్వేస్టేషన్ వద్ద రద్దీ



అలరించిన 'వల్లికుమ్మి' నృత్యం

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా కినత్తుకడవు కరియకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించిన వల్లికుమ్మి నృత్యం అలరించింది. పొన్మలై వేలాయుధస్వామి కళాక్షేత్ర ఆధ్వర్యంలో 75వ వెల్లికుమ్మి నృత్య ప్రదర్శన చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, ఉపాధ్యాయులు శివకుమార్ నేతృత్వంలో చిన్నారులు, పెద్దలు అని మొత్తం 500 మంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

అయ్యా వైకుంఠనాథర్ 193వ అవతార దినోత్సవం

తిరుత్తణి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అయ్యా వైకుంఠనాథర్ 193వ అవతార దినోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపం 11-వెంకటాపురం గ్రామంలోని వైకుంఠనాథర్ ఆలయం నుంచి బయల్దేరిన స్వామి చిత్రపటంతో కూడిన ఊరేగింపు తిరుత్తణి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని శరవణన్ అయ్యా, ఆయన అనుచరులు పర్యవేక్షించారు.



వైకుంఠనాథర్ ఊరేగింపు

పోలీసు గ్రీవెన్స్‌లో 129 వినతులు

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు శాఖ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసుల నుంచి 129 వినతిపత్రాలు పోలీసు కమిషనర్ అరుణ్ స్వీకరించారు. బదిలీ, పోలీసు క్వార్టర్స్ కేటాయింపు, వేతనాల తారతమ్యాలు తొలగించాలని సహా పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించిన కమిషనర్, వీటిని విచారించి పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.



పోలీసుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ్

కచ్చాదీవి వేడుకలకు 3464 మంది ఎంపిక



కచ్చాదీవిలోని ఆంథోనియర్ చర్చి

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి ఆంథోనియర్ చర్చిలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే ఉత్సవాల్లో భారతదేశం నుంచి పాల్గొనేందుకు 3464 మంది జాలర్లు ఎంపికయ్యారు. 1913లో కచ్చాదీవిలో ఓ తాటాకుల పర్ణశాలలో ఆంథోనియర్ విగ్రహం ఉండేది. సముద్రంలో చేపలవేటకు వెళ్లే జాలర్లంతా ఆ దీవిలోని ఆంథోనియర్‌ను దర్శించుకునేవారు. ఆంథోనియర్‌ను దర్శనం చేసుకుని వెళితే సముద్రం ప్రశాంతంగా ఉంటుందని, చేపల సంపద కూడా అధికంగా లభిస్తుందని జాలర్ల ప్రగాఢ నమ్మకం. ఆ తర్వాత ఇరుదేశాలకు చెందిన భక్తులు అక్కడ ప్రార్థనాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో ప్రతియేటా క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేసే కాలంలో ఆంథోనియర్ ఆలయ వేడులకు నిర్వహిస్తుంటారు. ఈ యేడాది జరుగనున్న వేడుకలకు పాల్గొనేందుకు భారతదేశానికి చెందిన జాలర్లు 2720 మంది పురుషులు, 652 మంది స్త్రీలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరితోపాటు 82 మంది బాలబాలికలు సహా మొత్తం 3464 మంది ఈ నెల 14వతేదీ ఉదయానికే భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ కచ్చాదీవి చేరుకుంటారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు పతాకావిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత జపమాల ప్రార్థనలు, శ్రీలంకకు చెందిన జాలర్లతో తమిళజాలర్లు కలిసి సమైక్య ఆరాధనలు నిర్వహించనున్నారు. రాత్రి ఆంథోనియర్ స్వరూపం ఉన్న రథాన్ని ఊరేగించనున్నారు. మార్చి 15 ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక తిరుపల్లి, సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం పతాకఅవనతంతో వేడుకలు ముగియనున్నాయి.

కోవిలూరులో అట్టహాసంగా జల్లికట్టు



ఎద్దును అణచివేసేందుకు సిద్ధమవుతున్న యువకులు

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఆలంగుడి సమీపం కోవిలూరులో ముత్తుమారియమ్మన్ ఆలయ వేడుకల్లో భాగంగా ఆ ప్రాంతానికి సెంగవల నాడార్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జల్లికట్టు పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంత్రి సీవీ మెయ్యనాథన్ ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు పుదుకోట, తంజావూరు, శివగంగ, దిండుగల్, మదురై జిల్లాలకు చెందిన 750 ఎద్దులను తీసుకువచ్చారు. ఈ ఎద్దులను అణచివేయడానికి 300 మంది యువకులు వచ్చారు. వీరందరికీ వైద్యపరీక్షలు చేసిన అనంతరం వాడి వాసల్ వద్ద జల్లికట్టు నిర్వాహకులు ప్రతిజ్ఞ చేయించారు. ఆ తరువాత వాడివాసల్ నుండి విడిచిపెట్టిన ఎద్దులను అణచివేయడానికి యువకులు తీవ్రంగా ప్రయత్నించారు విజేతలకు మంచాలు, బీరువాలు, గ్రైండర్లు, మిక్సీలు, నగదు బహుమతులు అందజేశారు. గెలిచిన ఎద్దుల యజమానులకు కూడా మంత్రి మెయ్యనాథన్ విలువైన కానుకలు పంపిణీ చేశారు. ఈ పోటీలకు ఆలంగుడి పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

చేతులు కలిపిన జెమిని ఎడిబుల్స్ అన్నపూర్ణ మసాల



జాయింట్ వెంచర్ 'జెఫ్' లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

అడయార్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ సన్ ఫ్లవర్ ఆయిల్ కంపెనీ జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్ ఇండియా, అన్నపూర్ణ మసాలా కంపెనీ సంయుక్తంగా 'జెఫ్' (జేఈఎఫ్) పేరుతో ఒక జాయింట్ వెంచర్ కంపెనీ ప్రారంభించాయి. ఈ కంపెనీ ద్వారా అన్నపూర్ణ మసాలా దినుసులను దేశ వ్యాప్తం గా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. మంగళవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి, సేల్స్ అండ్ మార్కెటింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, అన్నపూర్ణ మసాలా మేనేజింగ్ పార్టనర్, జెఫ్ ఫుడ్ ఇండియా సీఈవో విజయ్ ప్రసాద్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, 'వినియోగదారులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన మసాలా దినుసులను అందించడానికి జెమినితో ఒప్పందం కుదుర్చుకుని జెఫ్ పేరుతో జాయింట్ వెంచర్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జెఫ్ ఇండియా బలమైన మార్కెటింగ్ మద్దతుతో అన్నపూర్ణ మసాలా దినుసులను దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తామన్నారు. తద్వారా తమ మార్కెట్ వ్యాపారాన్ని పెంచుకుంటామని వెల్లడించారు.

'తమిళ్ సెమ్మాళ్' పురస్కార ప్రదానం



శ్రీనివాసన్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న మంత్రి స్వామినాథన్

వేలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంఘం కాట్పాడి ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 'తమిళ్ సెమ్మాళ్' పురస్కారం ప్రదానం చేసింది. చెన్నైలో జరిగిన కార్యక్రమానికి తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అరుళ్ ఆహ్వానం పలుకగా, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్, వైద్యులు కుమరగురు, ఇక్రమ్, సమరసం, రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి, కలవై సచ్చిదానంద స్వామి, కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘ సెక్రటరీ జనార్ధనన్, రోటరీ సంఘం అధ్యక్షుడు రామచంద్రన్ సహా పలువురు పాల్గొన్నారు.

నేటినుంచి క్రైస్తవుల ఉపవాస దీక్షలు

● భస్మ బుధవారం ప్రార్థనలకు చర్చిల ముస్తాబు

ప్యారీస్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు బుధవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించనున్నారు. భస్మ బుధవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు చర్చిలు ముస్తాబయ్యాయి. లోక రక్షణ కోసం యేసుక్రీస్తు శ్రమించిన కాలాన్ని గుర్తుచేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు 40రోజులు ఉపవాసం చేస్తారు. భస్మ బుధవారం ప్రార్థనలకు హాజరయ్యే భక్తుల నుదిటిపై క్రైస్తవ మతపెద్దలు భస్మంతో శిలువ గుర్తు వేస్తారు. గుడ్ ఫ్రైడే నుండి ఆదివారాలు మినహా, వెనుక వచ్చే బుధవారాన్ని క్రైస్తవులు భస్మ బుధవారంగా పాటిస్తారు. ఉపవాస రోజుల్లో వచ్చే ఏడు శుక్రవారాలను ప్రత్యేక దినాలుగా భావిస్తారు. 40రోజుల ప్రత్యేక ప్రార్థనలకు క్యాథలిక్, ఈసీఐ, సీఎస్ఐ, బాప్టిస్ట్, కల్వరి, మారనాథ, లూథరన్, అపోస్తులు తదితర చర్చిలు భారీ ఏర్పాట్లతో సిద్ధమయ్యాయి. కాగా, ఏప్రిల్ 13న మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు టెంకాయ, ఈత, కర్జూరం మట్టలతో ఊరేగింపులో పాల్గొంటారు. ఏప్రిల్ 18వ తేదీ గుడ్‌ఫ్రైడే వరకు ఉపవాసం చేపట్టనున్న క్రైస్తవులు అదే నెల 20వ తేదీ ఆదివారం ఉపవాసం విరమించి ఈస్టర్ పండుగ జరుపుకుంటారు.



భక్తులను కలిసి అభిప్రాయ సేకరణ చేస్తున్న శ్రీవారి సేవకులు

నమస్కారం.. చెప్పండి మీ అభిప్రాయం!

● టీటీడీలో మొదలైన 'ఫీడ్‌బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్'

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, సేవలు, దర్శనానికి వచ్చిన సమయంలో కలిగిన ఇబ్బందులు వంటి అంశాలపై భక్తుల నుంచి టీటీడీ అభిప్రాయ సేకరణ మొదలైంది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సహకారంతో 'ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్' ప్రారంభించారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు మూడు పద్ధతులను టీటీడీ ఏర్పాటు చేసుకుంది. ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్), వాట్సాప్ మెసెజ్ మోడ్, ఫిజికల్ సర్వే ల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. దీనికి 'నివేదన' అనే పేరును పెట్టారు. ఐవీఆర్ఎస్, ఫిజికల్ సర్వే పద్ధతలను టీటీడీ ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది.

అన్నీ బావున్నాయి!

గత నెల 14 నుంచి 20వ తేద వరకు శ్రీవారిని దర్శించుకున్న వారిలో 36,385 మందికి కాల్స్ వెళ్లగా అందులో 13,294 మంది స్పందించారు. వీరిలో 61.12 శాతం మంది బాగుందనగా, 27 శాతం పర్వాలేదని, మరో 11.88 శాతం బాగాలేదనే జవాబులిచ్చారు. ఫిబ్రవరి మొదటి వారంలో 2,244 మంది భక్తులను ఫిజికల్ సర్వేతో 9 ప్రశ్నలు అడిగారు. 72.5 శాతం బాగుందని, 18.7 శాతం పర్వాలేదని, 8.8 శాతం బాగోలేదనే సమాధానాలు అందాయి. దీని ద్వారా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఆయా విభాగాలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా వాట్సాప్ మెసెజ్ మోడ్‌ను కూడా ప్రారంభించనున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,683

తలనీలాలు సమర్పించినవారు: 23,453



ఫటా ఫట్

తిరుపతిలో జాతీయస్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తూకివాకం వద్ద 35ఎకరాల్లో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు శాప్‌చైర్మన్ రవినాయుడు కృషి చేస్తున్నారు. మరోపక్క క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధికి జరుగుతున్న కృషి గురించి జిల్లా క్రీడాధికారి సయ్యద్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారిలా..

\- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

● జిల్లా క్రీడాధికారి సయ్యద్

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులెంతవరకు వచ్చాయి?

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీనివాస క్రీడా సముదాయ అభివృద్ధి పనులను రూ.2కోట్లతో మొదలుపెట్టాం. ఇండోర్ స్టేడియంలో న్యూ ఉడెన్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఫైఅంతస్తులో రైఫిల్ షూటింగ్, జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాకింగ్‌ట్రాక్ పునరుద్ధరిస్తున్నాం. టెన్నిస్‌కోర్టు, సింథటిక్ లేయర్స్, గాల్వనైజింగ్ ఫెన్సింగ్‌కు రంగులు, ఈతకొలను మరమ్మతులు, గార్డెన్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రాల పరిస్థితి ఏమిటి?

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడులలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లుగా మరుగునపడిన ఈ కేంద్రాలను బాగుచేయడానికి ప్రభుత్వం అనుమతించింది. పెవిలియన్ బిల్డింగ్, ఇండోర్ స్టేడియం, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. సంరక్షకులు, సిబ్బంది నియాకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎప్పటికి పూర్తవుతుంది?


శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో తూకివాకం దగ్గర 35ఎకరాల భూమిని పరిశీలించాం. కలెక్టర్ ఇక్కడే ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు ప్రారంభమై పనులు చురుగ్గా సాగితే రెండేళ్లలో రెడీ అవుతుందని అనుకుంటున్నాం.

కోచ్‌ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారా?

కోచ్‌ల భర్తీపై ప్రభుత్వానికి నివేదించాం. హాకీ, పుట్‌బాల్, జూడో,రెజ్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్,వాలీబాల్, టెన్నిస్, ఖేలోఇండియా, హాకీ శిక్షకులు అందుబాటులో ఉన్నారు.

ఈసారి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారా?

ఈఏడాది 25వంతున రూరల్, అర్బన్ ప్రాంతాలను ఎంపికచేసి మెరుగ్గా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తాం. ఈ బాధ్యతలను ఔత్సాహిక పీడీ, పీఈటీలకు అప్పగిస్తాం. ఇందుకు గ్రాంట్స్ ఇస్తాం. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తాం.



మేమింతే.. మారమంతే!







నిబంధనలదేముందీ.. సవాలక్ష ఉంటాయి. అమలు చేయాలి కదా! తిరుపతి నగరంలో ఐదేళ్లు సాగిన అస్తవ్యస్థ ట్రాఫిక్ వ్యవస్థే ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల ఆచూకీ చాలా సార్లు కనిపించదు. కనిపించినా వారిది ప్రేక్షక పాత్ర మాత్రమే. ఉల్లంఘిస్తున్నారని ఎవరినైనా ఆపితే.. ఎలాగూ నాయకుల నుంచి ఫోన్లు వస్తాయని అనుకుంటున్నారేమో.. చేతికి ఏదీ అంటకుండా గడిపేస్తున్నారు. ఏకంగా గరుడ వారధి మీదే ఎదురు ప్రయాణాలు సాగుతూ ఉంటాయి. ఎర్ర లైటు వెలుగుతున్నా కూడళ్లలో దూసుకుపోతూనే ఉంటారు. ఇక ఒకే వాహనం మీద ముగ్గురు కాదు.. నలుగురూ, ఐదుగురూ కూడా రయ్ మంటూ ప్రమాదాలను వెతుక్కుంటూ వెళ్లిపోతుంటారు. ఇంత గందరగోళపు ట్రాఫిక్‌లోనూ మొబైల్‌లో మాట్లాడుతూ ఫీట్‌లు చేస్తుంటారు. తిరుపతి నగర ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పనితీరుకు సాక్ష్యమే మంగళవారం కనిపించిన ఈ దృశ్యాలు..

\-తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేణిగుంటలో ఎండీయూ ఆపరేటర్ నిర్వాకం

● కాటాకు అయస్కాంతం అంటించి బియ్యం పంపిణీ

● 10 కిలోలకు కిలో స్వాహా

రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ నిర్వాకంపై రేషన్ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కాటాకు అయస్కాంతం అంటించి ప్రతి 10 కిలోలకు కిలో స్వాహా చేస్తున్న సంఘటన మంగళవారం అత్తూరు గ్రామంలో వెలుగు చూసింది. స్థానిక కార్డుదారులు తెలిపిన వివరాలు... అత్తూరులో ప్రతినెలా ఎండీయూ ఆపరేటర్ గిరి గ్రామానికి చేరుకుని కార్డుదారులకు రేషన్ సరుకులు అందిస్తుంటాడు. అయితే మంగళవారం గ్రామంలో రేషన్ అందిస్తుండగా కాటాకు అయస్కాంతం అంటించి ఉండడాన్ని యువకులు గమనించి ఫొటోలు తీశారు. దీనిపై ఆపరేటర్ గిరిని ప్రశ్నించారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ గిరి బదులిచ్చారు. కాగా కార్డుదారులు మాట్లాడుతూ.. గత వైసీపీ హయాం నుంచి ఆపరేటర్ ఇలాగే సరుకులు పంపిణీ చేస్తున్నాడని, దీనిపై పలుమార్లు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో యువకులు కాటాకు అయస్కాంతం అంటించిన ఫొటోను ఎమ్మెల్యేకు చేరేంత వరకు షేర్ చేయాలని హ్యాష్ ట్యాగ్ తగిలిచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో మండలంలో వైరల్‌గా మారింది. ఈవిషయంపై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా... ఆపరేటర్ గిరిపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. మంగళవారం జరిగిన నిర్వాకం తన దృష్టికి వచ్చిందని అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు



కాటాకు అంటించిన అయస్కాంతం

అప్పుల బాధతో లైన్‌మ్యాన్ బలవన్మరణం

● విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఘటన ● సూసైడ్ నోట్‌లో అప్పుల వివరాలు

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ట్రాన్స్‌కో లైన్‌మ్యాన్ సీహెచ్ మురళీ కృష్ణ(57) మంగళవారం విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఉరేసుకుని మృతి చెందాడు. ఓజిలి ఎస్‌ఐ స్వప్న కథనం మేరకు వివరాలు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన మురళీకృష్ణ కురుగొండ సబ్ స్టేషనులో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. చాలాకాలంగా భార్యతో కలిసి నాయుడుపేటలో నివాసం ఉంటున్న ఆయన సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రిలీవ్ అవ్వాల్సి ఉంది. 8 గంటల సమయంలో ఏఈ అనిల్ ఫోన్ చేయగా మురళీకృష్ణ లిఫ్ట్ చేయలేదు. మళ్లీ మళ్లీ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మరో ఉద్యోగిని సబ్‌స్టేషను వద్దకు పంపారు. అతను వెళ్లి ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా మురళీకృష్ణ శ్లాబ్ కొక్కికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ట్రాన్స్‌కో ఏడీ, ఏఈతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సబ్‌స్టేషను వద్దకు చేరుకుని తలుపులు పగలగొట్టి మురళీకృష్ణ మృతదేహాన్ని కిందికి దింపారు. రికార్డులు పరిశీలించగా సోమవారం రాత్రి 12 గంటల వరకు విద్యుత్ రీడింగ్ నమోదు చేసినట్లు ఉంది. ఒంటిగంట నుంచి రీడింగ్ నమోదు చేయకపోవడంతో రాత్రి 12 - 1 గంట మధ్య ఉరేసుకుని ఉంటాడని ఎస్‌ఐ స్వప్న తెలిపారు. మురళీకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరికి వేలాడుతున్న మురళీకృష్ణ

అప్పుల వివరాలతో లేఖ

మురళీకృష్ణ ఉరేసుకునే ముందు తాను చేసిన అప్పుల వివరాలు రాసిపెట్టిన లేఖ సబ్‌స్టేషన్‌లో లభ్యమైంది. మొత్తం 26 మంది వద్ద అప్పు చేశానని, అందులో ఏడుగురు లాటరీ వాళ్లు ఉన్నట్లు తెలిపాడు. 19 మందికి రూ.7.71లక్షలు, ఏడుగురు లాటరీ వాళ్లకు రూ.60లక్షలు బాకీ ఉన్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఈ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదేమి విడ్డూరం సారూ..!

● గతంలో పనిచేసిన అధికారికి విచారణ బాధ్యతలు

పుత్తూరు అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో విడ్డూరం నెలకొంది. 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని సమగ్రస్థాయిలో విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే 2019 నుంచి నాలుగు సంవత్సరాల పాటు టౌన్ ప్లానింగ్ అధికారిగా సుభప్రద పనిచేశారు. కాగా, నేడు పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అక్రమాల విచారణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఈ పరిణామంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. దీనివల్ల విచారణలో పారదర్శకత ఎంత మాత్రం ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య అరగంట ఆలస్యంగా నడిచిన రైళ్లు

రేణిగుంట, మార్చ్ 4, (ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళవారం రాత్రి అరగంట ఆలస్యంగా నడిచాయి. వివరాల్లోకి వెళితే... మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన రాయలసీమ, కాచిగూడ, ఎగ్మోర్, వెంకట్రాది ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈక్రమంలో మామండూరు వద్ద రేణిగుంటకు వస్తున్న గూడ్స్ రైలు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇంజన్ పైలట్ గూడ్స్‌ను ఆపేశారు. దీంతో కడప రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను ఆపేశారు. ఇక్కడి నుంచి వెళ్లాల్సిన రైళ్లను పంపించారు. దీంతో ఈ రూటులో వెళ్లాల్సిన రైళ్లు అరగంట ఆలస్యంగా నడిచాయి.

న్యాయం కావాలంటూ..

● వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన

తిరుపతిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): న్యాయ దేవత వేషధారిణికి ఒక చేతిలో భారత రాజ్యాంగం. మరో చేతిలో త్రాసు. అందులో ఒక వైపు వెటర్నేరియన్ల కష్టం, ప్రొఫెషన్ ప్రాముఖ్యత బరువైన బ్లాకులుగా ఉంచారు. మరోవైపు తక్కువ మొత్తంలో స్టైఫండ్‌ని చిన్నపెట్టెలో ఉంచారు. విద్యార్థుల కష్టాల బరువు ఎక్కువగా ఉండటంతో త్రాసు సమతుల్యం కాదని.. న్యాయం ఎటువైపుకి ఒరగాలి.. అంటూ వెటర్నరీ విద్యార్థులు మంగళవారం వినూత్న తరహాలో నిరసన తెలిపారు. వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ నెల రోజులుగా వీరు చేపట్టిన నిరవధిక సమ్మె.. మంగళవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు వద్ద ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులు చేతపట్టారు. తమ హక్కులకోసం ప్రభుత్వాన్ని, వర్సిటీ అధికారులను వేడుకుంటున్నా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య విద్యార్థుల వద్దకు వచ్చి వెంటనే సమ్మెని విరమించి తరగతులకు హాజరుకావాలని, లేకుంటే బుధవారం నుంచి హాస్టళ్ల మెస్‌లని మూసివేస్తామన్నారు. ఆ మరుసటిరోజున హాస్టళ్లు ఖాళీచేయాల్సి ఉంటుందని వివరించారు. హాస్టళ్లను మూసినా సమ్మె కొనసాగిస్తామని విద్యార్థులు అంటున్నారు.

నేటినుంచి మెస్ సేవలు నిలిపివేత

నెల రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మెబాటలో ఉన్నందున్న బుధవారం నుంచి హాస్టళ్లకి అనుబంధంగా ఉన్న మెస్‌సేవలను నిలుపుదల చేస్తూ వర్సిటీ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈమేరకు విద్యార్థులకు మెస్‌సేవలు ఉండవని, అలాగే గురువారానికి హాస్టళ్లని పూర్తిస్థాయిలో ఖాళీ చేయాల్సిఉందని నోటీసులో పేర్కొన్నారు.



రాజకీయం చేస్తున్నారు

నా వ్యక్తిగత సమస్యను రాజకీయం చేస్తున్నారు

● రెండు పార్టీల నేతలపై లక్ష్మీరెడ్డి విమర్శ

తిరుపతి(వైద్యం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'నా ఆర్థిక లావాదేవీల సమస్యకోసం నేను మీడియా ముందుకు వచ్చా. ఆ సమస్యను ఆసరాగా తీసుకొని అధికార, ప్రతిపక్ష నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో తప్పుగా ట్రోల్స్ చేస్తున్నారు' అని ఇటీవల కిరణ్‌రాయల్‌పై ఆరోపణలు చేసిన లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను నా ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన ఒక్క వీడియో మాత్రమే విడుదల చేశా. అది కాకుండా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న మిగతా వీడియోలు, ఫొటోలన్నీ కొందరు రాజకీయ లబ్ధి కోసం పోస్టు చేశారు. అందులో నా ప్రమేయం లేదు. కిరణ్‌రాయల్ సొంత పార్టీకి చెందిన నేతలే ఏడాది కిందట నా వద్దకొచ్చి న్యాయం చేస్తామని చెప్పి ఆధారాలు తీసుకెళ్లారు. ప్రతిపక్ష పార్టీ నేతలతో కలిసి ఇప్పుడు వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో జనసేనకు చెందిన జిల్లా నేత ప్రమేయమే ఎక్కువగా ఉంది. ఇలా నా వ్యక్తిగత సమస్యను రాజకీయ లబ్ధికోసం రెండు పార్టీల నేతలు నాకు తెలియకుండా, నా విషయాన్ని తప్పుగా ప్రచారం చేశారు. దీనిపై ఇప్పటికే నేను ఆ నేతలపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశా. నాకే పార్టీతోనూ.. నేతలతోనూ సంబంధం లేదు. నా సమస్య పరిష్కారానికే పోరాటం చేశా. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను చూసి నా బిడ్డలు ఇంతటితో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టమని కోరడంతో, దీనిని ఇంతటితో ముగిద్దామనుకుంటున్నా' అని ఆమె పేర్కొన్నారు. జనసేన పార్టీలోని ఆ జిల్లా నేత ఎవరని మీడియా ప్రతినిధులు అడగ్గా.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అన్నీ తెలిపానన్నారు. ఇప్పటి వరకు ఏ పార్టీ నేతలూ తనకు మద్దతుగా లేరని, ఎవరి నుంచీ బెదిరింపులు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఒకవేళ ఉంటే జనసేన పార్టీకి చెందిన జిల్లా నేత నుంచి ప్రాణహాని ఉండొచ్చని, ఈ విషయాన్ని పోలీసులకూ చెప్పానన్నారు. వాళ్లు తనకు న్యాయం చేస్తారని బదులిచ్చారు.



ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం

వర్సిటీలు, కాలేజీల బంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉమ్మడి పీజీసెట్ రద్దు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ చేపట్టారు. పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే వెసులుబాటు యూనివర్సిటీలకే అప్పగించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వీరు బంద్‌కు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలు, కాలేజీలను విద్యార్థి నేతలు కలియతిరుగుతూ బంద్ పర్యవేక్షించారు. ఎస్వీయూనివర్సిటీలో విద్యార్థి సంఘాలన్నీ బంద్ సందర్భంగా ర్యాలీ చేపట్టాయి. యూనివర్సిటీలోనే బైఠాయించి నిరసన తెలిపాయి. ఉమ్మడి పీజీసెట్ వల్ల రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఇప్పటికే పీజీ ప్రవేశాలు భారీగా తగ్గాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో యూనివర్సిటీలే మూత పడే ప్రమాదం ఉందన్నారు. పీజీ అడ్మిషన్లు యూనివర్సిటీలే నిర్వహించుకునేటప్పుడు యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా అనుసరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, చలపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అక్బర్, ఎన్ఎస్‌యూఐ నేత జెన్నే మల్లికార్జున, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



బంద్‌లో పాల్గొన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు

తిరుమలలో మెరుగైన సేవలపై నివేదిక



ఈవో శ్యామలరావుతో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత బాధ్యతగా, మెరుగ్గా, సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్ర నివేదికను రూపొందించింది. బృందం సభ్యులు మంగళవారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును కలిసి నివేదికను అందజేశారు. దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణాపరమైన సూచనలను, సలహాలను తీసుకుని అమలు చేయాలనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వీరు గతనెల 28 నుంచి ఐదురోజుల పాటు తిరుమలలో పరిశీలించి నివేదికను తయారుచేశారు. సభ్యులు రఘుపాత్రుని లక్ష్మణరావు, చుండూరి సురేంద్ర, కొమరగిరి శ్యాంప్రసాద్, విశ్వనాథరెడ్డిలు పలు సూచనలతో ఈవోకు నివేదిక సమర్పించారు. వీరిని శ్యామలరావు అభినందించారు. నివేదికలోని అంశాలు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతాయని ఈవో అభిప్రాయపడ్డారు.